# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు






సంపుటి : 01 | సంచిక : | వరంగల్ | గురువారం, 19 మార్చి 2026 | పేజీలు : 02




# పాలకుర్తిలో అసలేం... జరుగుతుంది?


- అక్రమ గ్యాస్ సిలిండర్ల నిల్వపై అధికారుల కొరడా
- టిఫిన్ సెంటర్లు, హోటళ్లపై పదే పదే దాడులు

**పాలకుర్తి వాణి, ప్రత్యేక ప్రతినిధి:**

రాష్ట్రంలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నప్పటికీ.. కొందరు అమాయక ప్రజలను ఆసరా తీసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. బ్లాక్ దందాతో అక్రమ గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో పదే పదే దాడులు జరుగుతున్నాయి. అధికారులు ఈ దాడుల్లో గృహ నిర్మాణాలకు వినియోగించే సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్నారు. పలువురిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసి రీఫిల్లింగ్ చేస్తున్నాడనే సమాచారం జనగామ జిల్లా పాలకుర్తిలో ఉప్పల శ్రీనివాస్ పై కేసు ఇటీవల నమోదయింది. జనగామ సివిల్ సప్లై డిటి లచ్చు నాయక్ నేతృత్వంలో అధికారులు అకస్మాత్తుగా దాడి చేసి అక్రమంగా నిల్వ చేసి ఉంచిన 15 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై 6ఏ కేసు నమోదు చేయడంతో పాటు పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా సిలిండర్లను నిల్వ ఉంచడమే కాకుండా రీఫిలింగ్ చేయడం నేరమని లచ్చు నాయక్ తెలిపారు.

## పాలకుర్తిలో మరోసారి దాడులు

సివిల్ సప్లై అధికారులు పాలకుర్తిలో మరోసారి దాడులు నిర్వహించారు. హోటల్లు, రెస్టారెంట్స్ లపై రైడ్ చేసి ఐదు సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. గోదాంవారికి అప్పగించారు. దీంతో పాలకుర్తిలో అసలేం జరుగుతుందనే గుసగుసలు కాస్త బలంగానే వినిపిస్తున్నాయి. ఇంతలా అక్రమ గ్యాస్ దందా కొనసాగుతుందా ఆని పలువురు వాపోతున్నారు. ఈ విషయంపై ఆధికారిని వివరణ కోరగా దాడులు జరుగుతున్నాయని సమాధానమిచ్చారు.







# బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, పాలకుర్తి వాణి:** పాలకుర్తి మండలం వల్మిడిలోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానం లో ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పైన బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, సంబంధిత అధికారులతో మినీ కాన్ఫరెన్స్ హల్ లో రివ్యూ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్వామి వారి బ్రహ్మోత్సవాల కోసం వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలనీ, ఆయా శాఖల అధికారులు వారి పరిధిలో గల ఏర్పాట్లన్ని పక్కాగా చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం గా సీటింగ్ ఏర్పాట్లు ఉండాలని, విద్యుత్ సరఫరా లో ఆటంకం ఉండకూడదన్నారు. ఆర్డీ వో వెంకన్న, ఏసీపీ నర్సయ్య, ఆలయ ఈఓ, పాలకుర్తి తహసీల్దార్, విద్యుత్, వైద్య, పంచాయతీ రాజ్, పోలీస్, ఆర్టీసీ, ఫైర్, పంచాయతీ రాజ్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి రాజనరసింహతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి భేటీ

**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హైదరాబాద్ లో సమావేశమయ్యారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సదుపాయాల అభివృద్ధి దిశగా తీసుకోవాల్సిన చర్యలను ఆమె మంత్రికి వివరించారు. ఏడు పడకలుగా ఉన్న కొడకండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పెరుగుతున్న రోగులు బాధితుల దృశ్య 30 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయాలని కోరారు. ఇతరత్రా అంశాలతో పాటు విజ్ఞప్తిని మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ దిశగా చర్యలు చేపట్టిందన్నారు.



# మెరుగైన వైద్యం అందాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**దేవరుప్పుల, పాలకుర్తి వాణి :** పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల, అలాగే దేవరుప్పుల మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ, హాజరు వివరాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ప్రశ్నపత్రాల పంపిణీ విధానం, పర్యవేక్షణ ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో ప్రశ్నపత్రాల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా సరిచూసుకోవాలని సూచించారు. పరీక్ష తరగతి గదుల్లో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు సరిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులకు, సిబ్బందికి విధుల్లో బాధ్యతగా ఉండాలని తెలిపారు. అదే విధంగా దేవరుప్పుల మండల కేంద్ర పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఔషధాల నిల్వలు, వైద్యులు, నర్సుల హాజరు రిజిస్టర్, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. వైద్య సిబ్బంది అందరూ అందుబాటులో ఉన్నారా? టీకాలు సరిగా వేస్తున్నారా? రోగులకు సరైన చికిత్స అందిస్తున్నారా? వంటి విషయాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో రోగులకు సమయానికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీలు, శిశువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, తాగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు, అవసరమైన అన్ని మందులు నిల్వలో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవలు మెరుగుపడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది తమ విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు.

# నవోదయకు 'సిద్ధార్థ' విద్యార్థి ఎంపిక



**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి :** మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యాలయంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి వల్లపు సాత్విక్ జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. విద్యార్థి సాధించిన ఈ ఘనతపై పాఠశాల ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్ హర్షం వ్యక్తం చేస్తూ, సాత్విక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పట్టుదలతో చదివితే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. నవోదయ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో సీటు సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. కరస్పాండెంట్ జక్కుల ఊర్మిళ, దామోదర్, శంతన్, సౌమ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థి తల్లిదండ్రులు వల్లపు అశోక్ సంధ్య పాల్గొన్నారు.

# గిరిజనులకు బడ్జెట్లో 25 వేల కోట్లు కేటాయించాలి

**వీరన్న నాయక్, పి శ్రీకాంత్ డిమాండ్**




**హనుమకొండ, పాలకుర్తి వాణి:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దళితులు, గిరిజనుల ఓట్లే ప్రధానమని తెలంగాణ గిరిజన సంఘం హనుమకొండ జిల్లా కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి వీరన్న నాయక్, పి శ్రీకాంత్‌లు అన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో దళితులు గిరిజనులకు అనేక హామీలు ఇచ్చిందని వారు తెలిపారు. అందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను గ్యారెంటీ కార్డుగా ఉపయోగించి చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. గిరిజనులకు 15 రకాల వాగ్దానాలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. గత రెండేళ్ల బడ్జెట్లో గిరిజనులకు కేటాయించిన 30 వేల కోట్లలో కేవలం 4 వేల కోట్లు కూడా ఖర్చు చేయకుండా మిగిలిన వేలకోట్ల నిధులను దారిమళ్లించిందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బానోత్ జగన్, భూక్య తిరుపతి, భూక్య స్వరూప, రాయపూరి సారయ్య, భూక్య సిద్ధు, భూక్య లాలు, అంగడి ప్రభాకర్, ధరావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పాలకుర్తి పరిసరాలలో ఎల్లమ్మ సినిమా

# షూటింగ్‌కు సన్నాహాలు

**పాలకుర్తి, పాలకుర్తి వాణి :** శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై బలగం వేణు దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాతగా ఎల్లమ్మ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పాలకుర్తి పరిసరాలతో పాటు కొండాపురం, వల్మిడీ, కోలన్ పల్లి కొండ ప్రాంతాల్లో చిత్రికరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. డైరెక్టర్ వేణు తోపాటు యూనిట్ సభ్యులు ఏ ప్రాంతాల్లో సందర్శించారని ప్రొడక్షన్ మేనేజర్ డాక్టర్ మేడారపు సుధాకర్ తెలిపారు. షూటింగ్ లొకేషన్ ల కోసం దర్శకుడు వేణు, కబాలి, ఖుషి, సరిపోదా, కెమెరామన్ జి. మురళి వర్ధన్, ఆర్ట్ డైరెక్టర్ రామాంజనేయులు రెండు రోజులు పరిశీలించారన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఎల్లమ్మ సినిమా షూటింగ్ చారిత్రక నేపథ్యం కలిగిన పాలకుర్తిలో చిత్రీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాలకుర్తిలోని సహజ నటులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మేనేజర్స్ రవి, సత్య, డాక్టర్ తాళ్లపెల్లి నరేష్ పాల్గొన్నారు.

# నేడు పాలకుర్తిలో ఇఫ్తార్ విందు

**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి :** నియోజకవర్గ కేంద్రంలోని బషారత్ వేడుకల మందిరంలో నేడు ఇఫ్తార్ విందు నిర్వహించనున్నారు. పాలకుర్తితో పాటు రాయపర్తి, తొర్రూరు, కొడకండ్ల, పెద్ద వంగర, దేవరుప్పుల మండలాల నుంచి ముస్లిం సోదరులు హాజరు కానున్నారు. ప్రభుత్వ అధికారిక ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కూడా హాజరవుతున్నట్లు నాయకులు మదార్, సలీం తెలిపారు.

# కుక్కల దాడిలో 4 గొర్రెలు మృతి..

# 25 గొర్రెలకు గాయాలు

**దేవరుప్పుల, పాలకుర్తి వాణి :** పిచ్చికుక్కల దాడిలో 4 గొర్రెలు మృత్యువాత పడగా.. సుమారు 25 గొర్రెలకు గాయలైన ఘటన దేవరుప్పుల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గొర్రెలు కాస్తూ తోటకూరి చినచంద్రయ్య, రాసాల బిక్షపతి జీవనం కొనసాగిస్తున్నారు. పశువుల షెడ్డులో కట్టేసి వెళ్ళగా అర్ధరాత్రి ఎవ్వరు లేని సమయంలో పిచ్చికుక్కలు గొర్రెల మందపై వేర్వేరుగా తీవ్రంగా దాడులతో విధ్వంసం సృష్టించాయి. దీంతో 4 గొర్రెలు మృత్యువాత పడగా మరో 4గొర్రెల పరిస్థితి విషమంగా ఉందని, ఇంకా 20గొర్రెలకు గాయాలయ్యాయని వాపోతున్నారు. దాదాపు నాలుగు లక్షల వరకు నష్టపోయామని ఆవేదన చెందుతున్నారు.



Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341